తండారోడ్డు ఇలా.. వెళ్లేదెలా

- నిధుల్లేవంటూ మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- కంకర రోడ్డుతో ప్రమాదాల బారిన గిరిజనులు
- మున్సిపల్ పరిధిలో ఉన్నా వసతులు కరువు
- కంకర రోడ్డుపై నుంచి వెళ్తే బొబ్బ లెక్కుతున్న కాళ్లు

గిరిజన తండా వెళ్లే కంకర రోడ్డు

రామాయంపేట, ఏప్రిల్ 1 : కంకర రోడ్డుపై నడిస్తే కాళ్లు బొబ్బలెక్కుతున్నా మాపై దయ చూపరా.. అంటూ గిరిజన వాసులు అధికారులను, నాయకులను వేడుకుంటున్నారు. రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గిరిజన తండాకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. రెండేండ్ల కింద గిరిజన తండాకు రూ. కోటిన్నరతో బీటీ రోడ్డుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టింది. కోమటిపల్లి గ్రామం నుంచి గిరిజన తండా వరకు కంకర పనులు చేపట్టింది. తీరా ప్రభుత్వం మారడంతో శిలాఫలకం శంకుస్థాపనకే పరిమితమైంది. తండా వరకు కంకర పర్చిన కాంట్రాక్టర్ తనకు బిల్లులు రావడం లేదంటూ పత్తా లేకుండా పోయాడు. అప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. రెండేండ్ల కాలం నుంచి కంకర రోడ్డుతో గిరిజన వాసులు నడవలేక తీవ్రఇబ్బందులకు గురవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర రోడ్డు అలా ఉంటే ఇక తండాకు ప్రభుత్వం కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. తండా వాసులకు కనీసం తాగుదామన్నా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదు. మున్సిపల్‌కు వెళ్లి ఏ అధికారికి చెప్పినా ఫలితం లేకుండా పోతున్నది. అధికారులు పేరుకే తండాకు వస్తారు.. ఇగచేస్తం.. అగ చేస్తం.. అంటూ కాలయాపన చేస్తున్నారు. నీళ్ల కోసం దూర ప్రాంతానికి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని గిరిపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాకు రోడ్డు తోపాటు కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

కోమటిపల్లి గిరిజన తండాలో హనుమాన్ ఉత్సవాల్లో భాగంగా కాళ్లు కాలిపోతున్నా కంకర రోడ్డుపైనే నడుస్తున్న భక్తులు

నిధుల్లేవంటూ వెళ్లి పోయిన కాంట్రాక్టర్

కంకర పర్చిన కాంట్రాక్టర్ నిధులు రావడం లేదంటూ పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లి పోయిండు. రోడ్డుపై నుంచి నడవాలంటేనే కాళ్లు బొబ్బలెక్కు తున్నాయి. మాకు ఎన్ని కలప్పుడు హామీలు కురిపించే నాయకులు ఇప్పుడు పనులు చేయడంలో మాత్రం తండాకు రావడం లేదు.

-చత్రియా నాయక్, తండావాసి

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..

అధికారులు మాకు కనీసం తాగునీరు సరఫరా చేయడం లేదు. రెండేండ్లుగా తాగునీరు సరిగ్గా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సమస్య వేధిస్తున్నది.

-బన్సీలాల్ నాయక్, తండావాసి

దవాఖానకు వెళ్లాలంటే ..

రామాయంపేట దవాఖానకు వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. కంకర రోడ్డు వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఈ కంకర తేలిన రోడ్డుతో అరగంటలో వెళ్లాల్సిన సమయంలో రెండు గంటలు పడుతుంది.

-పెంట్యా నాయక్, గిరిజన తండా

ఎల్ వోసీ అందజేత

బాధిత కుటుంబ సభ్యుడికి ఎల్ వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 1 : బాధిత కుటుంబ సభ్యుడికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం మాదాపూర్‌లోని ఆమె నివాసంలో ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన భూషణానికి రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, ఏప్రిల్ 1 : మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కట్టెల నాగమణి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. వైద్యఖర్చులకు మంజూరైన రూ. లక్ష ఎల్‌వోసీని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. ఆమె వెంట మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

నిజాంపేట, ఏప్రిల్ 1 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన స్వామిగౌడ్ (55) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్ ద్వారా బాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు దుబ్బరాజాగౌడ్, అంజగౌడ్, పర్శగౌడ్, ఫిరోజ్, శంకర్, బాల్‌రాజు, రామాగౌడ్, బాలయ్య, స్వామి, చంద్రగౌడ్, లక్ష్మణ్, యాదగిరి, తదితరులు ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

రామాయంపేట రూరల్, ఏప్రిల్ 1 : విద్యుత్ శాఖలో ఏండ్ల తరబడి ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని విద్యుత్ శాఖ ఔట్ సోర్సింగ్ తూప్రాన్ డివిజన్ కన్వీనర్ మైలారం భూమయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 ఏండ్ల నుంచి ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నా, ఇప్పటి వరకు రెగ్యులరైజ్ కాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి

మనోహరాబాద్, ఏప్రిల్ 1 : విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బెలియ గ్రామానికి చెందిన రఘునాథ్‌సింగ్ (21) ఉపాధి నిమిత్తం మనోహరాబాద్ మండలం కొండాపూర్ లోని శ్రీయన్ పాలిమార్స్ పరిశ్రమలో ఆరు నెలలుగా కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం పరిశ్రమలో పని చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మనోహరాబాద్, ఏప్రిల్ 1: కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. మనోహరాబాద్ ఎస్సై సుభాశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం జైపూర్‌కు చెందిన అనిల్ మింజ్ (47) ముప్పిరెడ్డిపల్లిలో తన స్నేహితులు ఉండటంతో పని కోసం ముప్పిరెడ్డిపల్లికి వచ్చి ఓ పరిశ్రమలో పనికి కుదిరాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికని గత నెల 7న ఇంట్లో నుంచి బయలు దేరాడు. అప్పటి నుంచి స్నేహితులు వెతికినా ఆచూకీ లభించలేదు. సొంతూరుకు వెళ్లాడేమోననే అనుమానంతో అతడి భార్య మగరేట్ మింజ్‌కు ఫోన్ చేయగా రాలేదని తెలిపింది. విషయం తెలుసుకున్న అనిల్ మింజ్ భార్య ముప్పిరెడ్డిపల్లికి చేరుకొని మంగళవారం మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

బాధిత కుటుంబీకులకు చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

తూప్రాన్, ఏప్రిల్ 1 : తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మాజీ మంత్రి హరీశ్ రావు అందజేశారు. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన మణెమ్మకు రూ. 60 వేలు, తేజావత్ రాజేశ్‌కు రూ.39 వేలు, మంజులకు మంజూరైన రూ. 16 వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. మాజీ సర్పంచ్ సుకన్య, రమేశ్ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

మనోహరాబాద్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్ ప్రభుత్వ దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్, ఏప్రిల్ 1 : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందజేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మనోహరాబాద్ మండల పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ దవాఖానలకు ధీటుగా ప్రభుత్వ దవాఖానలో ఆత్యాధునిక పరికరాలు, మౌలిక సదుపాయాలు, వసతులతో వైద్య సేవలను అందజేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ గోదాం నుంచి అక్రమంగా బియ్యం తరలింపు

అక్రమంగా బియ్యం తరలిస్తున్న డీసీఎం

మెదక్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : మెదక్ పట్టణంలోని సీడబ్ల్యూసీ (సెంట్రల్ హౌసింగ్ కార్పొరేషన్) గోదాం నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తున్న డీసీఎం యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు మెదక్ పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం రోజు 70 బస్తాల్లో సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని డీసీఎంలో గుట్టుగా తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు డీసీఎంను అదుపులోకి తీసుకున్నారు. సీడబ్ల్యూసీ గోదాం నుంచి డీసీఎం వ్యాన్‌లో బియ్యం తరలిస్తున్న డ్రైవర్ చందర్, డీసీఎం యజమాని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీకి ఆహ్వానం

మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ

రామాయంపేట, ఏప్రిల్ 1 పట్టణంలోని శ్రీ కల్యాణ రామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి ఆలయ కమిటీ ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం హవేళీఘన్‌పూర్ మండలంలోని కూచనపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. నక్క సిద్ధరాములు, స్వామిగౌడ్, నవాత్ ప్రసాద్, నవాత్ ప్రభాకర్ ఉన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు

బుజ్రాన్‌పల్లిలో కుస్తీలు పడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లిలో కొనసాగుతున్న పద్మావతి సహిత లక్ష్మీవెంకటేశ్వర దేవాలయం జాతరలో భాగంగా సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరా హోరీగా అలరించాయి. పెద్దశంకరంపేట మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లయోధులు ఈ కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కరాటేతో ఆత్మరక్షణ

బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 1 : కరాటేతో శారీరక పటుత్వం, ఆత్మరక్షణ, మానసికోల్లాసం కలుగుతాయని రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ కరాటే మాస్టర్ నగేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం మెదక్‌లో గుల్షణ్‌క్లబ్‌లో షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే పరీక్షలు నిర్వహించారు. ఈ కరాటే పరీక్షల్లో విజేతలకు నగేశ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ పొంది రాణించాలన్నారు. విద్యార్థి దశలోనే తమని తామే రక్షించుకునేందుకు వారిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు కరాటే శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. మాస్టర్లు విద్యాసాగర్, దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

నిజాంపేట, ఏప్రిల్ 1 : అంబేద్కర్ విగ్రహానికి నిప్పంటించిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిజాంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని గద్వాల్ జిల్లా కేటిదొడ్డి మండలం ఇర్కుచెడు గ్రామంలో దళిత,బహుజనులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్న క్రమంలో మరో వర్గానికి చెందిన వారు విగ్రహం పెట్టొద్దంటూ ఘర్షణకు దిగి అంబేద్కర్ విగ్రహానికి పెట్రోలు పోసి నిప్పంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహానికి నిప్పంటించిన వారిని కఠినంగా శిక్షించి,వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలన్నారు. నిరసన తెలిపిన వారిలో దళిత ప్రజా సంఘాల నాయకులు సంజీవ్, శ్రీనివాస్, బాబు, ఎల్లం, స్వామి, రామస్వామి, బాల్‌రాజ్, రాజు, బాబు, ఎల్లం తదితరులు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు బాలికలకు శుభసూచకం

రామాయంపేట, ఏప్రిల్ 1: పదకొండేండ్ల బాలికను తాకరానిచోట తాకడం అత్యాచార ప్రయత్నం కాదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. భారత సుప్రీం కోర్టు ధర్మాసనం ఇలాంటి తీర్పు వల్ల అమాయక బాలికలు కామాంధుల చేతిలో బలవుతారని, ఇలాంటి తీర్పులు ఇవ్వడం సరికాదని సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం హర్షించదగ్గ విషయమని విజన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వంగరి కైలాస్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తు జస్ట్ రైట్సు ఫర్ చిల్డ్రన్ అలయన్సు దాఖలు చేసిన ప్రత్యేకమైన ఐదు పిటిషన్లను సుప్రీంకోర్టు అంగీకరించినట్లు తెలిపారు. ప్రతి ఆడబిడ్డకు న్యాయం జరుగాలన్నదే విజన్ సంస్థ ఉద్దేశ్యమన్నారు.

శ్రీయన్ పాలిమార్స్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

మనోహరాబాద్, ఏప్రిల్ 1 : పరిశ్రమల యజమాన్యాలు కార్మిక చట్టాలను ఉల్లఘిస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆరోపించారు. మనోహరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లో ఉన్న పరిశ్రమల యజమాన్యాలు ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని ఆరోపించారు. వలస కార్మికులతో 12 గంటలు పని చేయించుకోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గతేడాదిగా ఎంతో మంది కార్మికులు పరిశ్రమల్లో జాగ్రత్తలు లేక మృత్యువాత పడ్డారన్నారు. శ్రీయన్ పాలిమార్స్ పరిశ్రమలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన రఘునాథ్‌సింగ్ కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, మృతదేహాన్ని తరలించేందుకు పూర్తి ఖర్చులను భరించాలన్నారు. పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్‌రూరల్, ఏప్రిల్ 1 : ప్రజలందరూ పండుగలను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని, క్షణికావేశంలో తెలిసి తెలియక ఘర్షణలు పడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి లో కొందరు యువకులు ఉగాది రోజు గొడవలు పడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈ విషయంపై మెదక్ ఆర్డీవో ,రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్ తో పాటు అధికారులు గ్రామానికి చేరుకొని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల గొడవలు పడితే కేసులు నమోదై భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై మురళి, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ లక్ష్మణ్, గ్రామస్తులు ఉన్నారు.

బంజారా ఫాస్టర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడిగా బానోత్ తిమోతీ నాయక్

శివ్వంపేట, ఏప్రిల్ 1 : తెలంగాణ రాష్ట్ర బంజార ఫాస్టర్ ఫెలోషిప్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా శివ్వంపేట మండలం సీతారాం తండాకు చెందిన తిమోతీనాయక్ ఎన్నికయ్యారు. మంగళవారం నిజామాబాద్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బంజారా ఫాస్టర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బంజార ఫాస్టర్ల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన

నస్కల్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

నిజాంపేట, ఏప్రిల్ 1 : మండలంలోని నస్కల్‌లో ముస్లింలు చేతికి నల్ల బ్యా డ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ధార్మిక సంస్థలను లాక్కునేందుకు వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇది ఏ మాత్రం మంచి పద్ధతి కాదన్నారు. ఈ మేరకు 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు' పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపామన్నారు. ముస్లిం సోదరులు షానమద్, అమాజ్, జుబేర్, రహీమ్, హనీఫ్, సద్దాం, సులేమాన్, ముస్తఫా, అబ్దుల్లా, నిజాం, సాజిద్, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

చాముండేశ్వరీ మాతను దర్శించుకున్న అదనపు కలెక్టర్

చాముండేశ్వరీ మాతను దర్శించుకుటున్న అదనపు కలెక్టర్ నగేశ్ దంపతులు

చిలిపిచెడ్, ఏప్రిల్ 1 : చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని మంజీరానది తీరాన వెలసిన ప్రసిద్ధిగాంచిన శ్రీ చాముండేశ్వరీ అమ్మవారిని మంగళవారం అదనపు కలెక్టర్ నగేశ్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజలు ప్రభాకర్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మోతీలాల్ శర్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురికి గాయాలు

కోమటిపల్లి గిరిజన తండాకు వెళ్లే రోడ్డులో చెరువులోకి వెళ్లిన కారు

రామాయంపేట, ఏప్రిల్ 1 : ప్రమాదవశాత్తు కారు చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గిరిజన తండాలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలోకి వెళితే.. తండాకు చెందిన మహేశ్ కారులో రోజులాగే రాత్రి పూట రామాయంపేట ఎక్కలదేవ్‌బండ నుంచి తన స్వగ్రామమైన గిరిజన తండాకు బయలుదేరాడు. ఉదయం కారు తీసుకెళ్తున్న తండావాసి కంకర రోడ్డు వల్ల కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిం ది. దీంతో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. తండాకు వెళ్లే రోడ్డువల్ల ఇలా ప్రతిరోజు ప్రమాదాలకు గురవుతున్నామని ప్రభుత్వ అధికారులు మా తండాకు వెంటనే రోడ్డువేసి మా బాధలను తీర్చాలని కోరుతున్నారు.

వివిధ రంగాల్లో రుద్రారం విద్యార్థుల ప్రతిభ

రక్బీ క్రీడలో రెండో స్థానం సంధించిన కీడాకారిని సారిబాకౌసర్

రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని అర్చిత

క్రికెట్ క్రీడారంగంలో రాణిస్తున్న శ్రీకాంత్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 1 : కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు, వివిధ రంగాల్లో రాణిస్తూ, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్నశంకరంపేట మండల పరిధి రుద్రారానికి చెందిన విద్యార్థులు రక్బీ, క్రికెట్ సాంస్కృతిక కార్యక్రమాల్లో రానిస్తున్నారు. గ్రామానికి చెందిన సయ్యద్‌పాషా కూతురు సారిబా కౌసర్ మెదక్‌లోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతూ అండర్ 17 రక్బీ ఆటలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఇదే గ్రామానికి చెంది క్రికెట్ క్రీడాకారుడు శ్రీకాంత్ అండర్ 19లో హైదరాబాద్ క్రికెట్ జట్టులో ఆడి బెంగళూరు, చండీఘర్, ఢిల్లీలో తన ప్రతిభను కనబరిచారు. చందంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అర్చిత పదో తరగతి చదువుతూ ఎరుకల నాంచారి సోది వేషం వేసి రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెలిచింది. ప్రతిభను కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పని చేసుకు నేవారే ఉండటం విశేషం. ప్రభుత్వం వీరి ప్రతిభను గుర్తించి శిక్షణను అందిస్తే తెలంగాణ రాష్ట్రానికే పేరు తెచ్చి పెడతారని మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణతోనే విద్యార్థులు ఇతలా రానిస్తే ప్రత్యేక శిక్షకుడు ఉండి ఉంటే రాష్ట్ర స్థాయిలో మెరుస్తారని తెలిపారు.

బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1 : ఐపీఎల్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని మంగళవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత బానిసలుగా మారి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. బెట్టింగ్ నిర్వహించే వారిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని, ఇంట్లో తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TOURS & TRAVELS

★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.

NT-1899

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.